సాక్షి
అనకాపల్లి
శనివారం । 29 । జూన్ । 2024



క్షీరాభిషేక సేవ
విశాఖ : శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉభయదాతలు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలోచింపజేసిన కళాజాత
విశాఖ: బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలుచోట్ల కళాజాత నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.8/25.0

వాతావరణం
తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 18 వినతులు


పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డేకు 18 మంది సిబ్బంది హాజరై ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందినట్టు ఎస్పీ చెప్పారు. సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

2న మెగా జాబ్ మేళా
చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే నెల 2న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాకు పన్నెండు ప్రసిద్ధ కంపెనీలు హాజరవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు పదో తరగతి నుంచి డిగ్రీ, ఆపై విద్యార్హతలు ఉన్న యువత హాజరు కావచ్చన్నారు. చోడవరం పరిసర ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్, సీనియర్ ఉపన్యాసకులు హెచ్.సుధీర్‌ను 7780688683 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. జూలై నెల రెండున ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జూనియర్ గోల్ఫ్ చాంప్ కేయ కుమార్



విశాఖ స్పోర్ట్స్: ఇండోనేషియాలోని బాలిలో జరిగిన అంతర్జాతీయ జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ గోల్ఫర్ బి.కేయకుమార్ విజేతగా నిలిచింది. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం సాధించిన కేయ పలు విజయాలను ఏడేళ్లగా సాధిస్తూ వస్తోంది. గతేడాది జరిగిన జాతీయ క్రీడల్లో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించింది. భారత గోల్ఫింగ్ సమాఖ్య ప్రకటించిన తొలి 15 మంది బాలికల గోల్ఫర్ల మెరిట్‌లో స్థానం సాధించింది. అత్యుత్తమ్మ ప్రదర్శన కనబరిచినందుకు కేయకుమార్ ప్రతిష్టాత్మక ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ నిర్వహించే డ్రైవ్ ఫర్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమాలకూ ఎంపికైంది.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ ఆప్షన్లు


డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌ను ఇచ్చుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి శుక్రవారం తెలిపారు. జూన్ 30వ తేదీ నుంచి జూలై 4వతేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని మొదటి విడతలో సీటు రాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్‌లో ఎంచుకునేవారికి జూలై 5వ తేదీ నుంచి 7వతేదీ వరకు సీట్లు కేటాయింపులు ఉంటాయని, జూలై 9వ తేదీ నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలనలు జరుగుతాయని తెలిపారు.


నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు
మహారాణిపేట (విశాఖ): ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్టు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పోలినాయుడు శుక్రవారం తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, 11 గంటలకు నాలుగు, మూడు, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు.


నిండుకుండలా జలాశయాలు

జిల్లాలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గం మాడుగుల.. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న జలాశయాలు నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నదులు, కాలువలు పొంగి ప్రవహిస్తుండగా, చెరువుల్లో జలకళ సంతరించుకుంది. దాంతో అన్నదాతకు ఖరీఫ్ సాగుపై బెంగ తీరింది. ఈ ఏడాది సాగునీరుకు ధోకా లేదని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

- రైవాడ, కోనాం, పెద్దేరులో పెరిగిన నీటిమట్టం
- ఖరీఫ్ వరి సాగుకు భరోసా
- అన్నదాత సుఖీభవ సాయం కోసం ఎదురుచూపు

మాడుగుల: ఖరీఫ్ వర్షాలతో జలాశయాలు, చెరువులు కళకళలాడుతున్నాయి. వీటి ఆయకట్టులో రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇప్పుడిప్పుడే జలాశయాల్లో నీటిమట్టం పెరుగుతోంది. మాడుగులలో పాలగెడ్డ, గొరిగెడ్డల తోపాటు పెద్దేరు, తారకరామ, చీడికాడలో కోనాం, దేవరాపల్లిలో రైవాడ జలాశయాల్లో సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని ఆశాభావంతో ఉన్నారు. వీటి ఆయకట్టు కింద సుమారు 50 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వరినారు ఏపుగా పెరుగుతుండటంతో మరో వారం రోజుల్లో దమ్ములు ప్రారంభం కానున్నాయి. కె. కోటపాడు మండలంలో జలాశయాలు లేకపోయినా చెరువుల ఆధారంగా సాగుకు దిగుతున్నారు. మాడుగుల నియోజకవర్గంలో పెసర, మినప, రాగులు, తదితర అపరాల సాగు 20 వేల ఎకరాల్లో చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు అనుకూలించడంతో అపరాల సాగు పంట చేతికి వస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో 13,500 ఎకరాలు. చీడికాడలో 10 వేల ఎకరాలు, దేవరాపల్లిలో 12 వేల ఎకరాలు, కె.కోటపాడులో 10,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.


నీటితో పుష్కలంగా పెద్దేరు జలాశయం


సాగునీరుతో రైవాడ జలాశయం


కళకళలాడుతున్న తారకరామ జలాశయం

అన్నదాతకు ఏదీ 'సుఖీభవ'?
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా ముందుగానే విత్తనాలతోపాటు వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతు భరోసా పథకం కింద మొదటి విడతలో రూ.5,500 ఇచ్చేది. దాంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయం చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే 'అన్నదాత సుఖీభవ' పేరిట సాయం అందిస్తామన్నారు. అయితే పీఎం కిసాన్ యోజన అందినా, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం సాయం విడుదల చేయకపోవడంతో ఖరీఫ్ వరి విత్తనాలు కొనుగోలుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు చేశారు. మరి కొంతమంది బ్యాంకుల చుట్టూ తిరిగి రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జలాశయాల నీటిమట్టం మీటర్లలో..

జలాశయం	గరిష్ఠం	ప్రస్తుతం
పెద్దేరు	137	136.40
కోనాం	101.25	95.60
రైవాడ	114	105.10

పెట్టుబడి సాయం అందలేదు



గత ప్రభుత్వం రైతు భరోసా సాయం ఇచ్చేది. దాంతో ఖరీఫ్ సాగుకు ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ నగదు ఇంకా అందలేదు. విత్తనాలు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడ్డాను. అప్పు చేసి వాటిని కొనుగోలు చేశాను. ప్రస్తుతం వరి నారుమడులు సిద్ధం చేసుకున్నాం. జలాశయాలు, చెరువుల్లో సాగు నీరు ఉండటంతో ఖరీఫ్ సాగుకు దిగుతున్నాం. వ్యవసాయ పెట్టుబడులుకు ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాలి. – **వర్రే రామునాయుడు,** రైతు, గాదిరాయి, మాడుగుల మండలం

ఖరీఫ్‌కు ధోకా లేదు
ప్రస్తుతం వాతావరణం అనుకూలించి వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలతోపాటు చెరువుల్లో సాగు నీరు చేరుతోంది. పెద్దేరు ఆయకట్టులో ఖరీఫ్ పంటకు ఇబ్బంది లేదు. మంచిదిగుబడి సాధించే అవకాశం ఉంది.

– **సుధాకర్‌రెడ్డి,** జేఈ, పెద్దేరు జలాశయం, మాడుగుల

'గోవాడ' రైతులకు రూ.15.32 కోట్ల చెల్లింపులు
నేటి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ



చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులకు చెరకు బకాయిలు చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈనెల 29వ తేదీన రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు శుక్రవారం తెలిపారు. 2023–24 క్రషింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన వారికి ఇప్పటికే మూడు విడతల్లో కొంతమేర సొమ్ము చెల్లించామని, ఇప్పుడు మిగతా రూ.15 కోట్ల 32 లక్షలు చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి మార్చి 12వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన రైతులకు చెల్లింపులు చేస్తున్నామన్నారు. 6,346మంది రైతులకు టన్నుకు రూ.2,500 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. గడిచిన సీజన్‌లో 2 లక్షల టన్నుల క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే చెరకు లేకపోవడంతో లక్షా 70 వేల 601 టన్నుల చెరకు క్రషింగ్ చేయడం జరిగిందన్నారు. సరాసరి రికవరీ 9.02 రాగా లక్షా 46 వేల 309 క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేశామన్నారు. చెరకు సరఫరా చేయడంలో ఫ్యాక్టరీ సభ్య రైతులు మరింత చొరవ చూపి ఈ ఏడాది చెరకు విస్తీర్ణం సాగు పెంచాలని ఆయన కోరారు. కనీసం 3 లక్షల టన్నులైనా చెరకు సరఫరా అయ్యేలా రైతులు ఈ ఏడాది సాగు పెంచాలన్నారు. అవసరమైన వారికి సబ్సిడీపై ఎరువులు, విత్తనం కూడా అందిస్తున్నామని ఎండీ సన్యాసినాయుడు చెప్పారు.

ఉక్కు ఉద్యోగులకు కొత్త చిక్కులు!

- ఆరు నెలలుగా ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్‌కు పీఎఫ్ చెల్లించని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- రూ.270 కోట్ల వరకు బకాయిలు!
- ట్రస్ట్‌కు ఈపీఎఫ్‌వో మినహాయింపు రద్దు అవుతుందని ఉద్యోగుల ఆందోళన

ఉక్కునగరం (విశాఖ): స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ మినహాయింపు ట్రస్ట్ (ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్) పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వైఖరి కారణంగా ఆరు నెలలుగా ట్రస్ట్ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. దీంతో ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ పనితీరుపై ఈపీఎఫ్‌వో అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ట్రస్ట్‌కు ఈపీఎఫ్ మినహాయింపులు తొలగించే అవకాశం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉద్యోగుల ఈపీఎఫ్ నిర్వహణకు సంబంధించి ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్‌కు ఈపీఎఫ్‌వో అనుమతిచ్చింది. ఉద్యోగుల కంట్రిబ్యూషన్, యాజమాన్యం వాటాలను ట్రస్ట్‌కు బదిలీ చేస్తారు. ఆ డబ్బులను ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ తదితర ఆర్థిక సంస్థల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా ట్రస్ట్ లాభాలబాటలో నడిచేది. ఈపీఎఫ్‌వో ప్రతి ఏడాది ప్రకటించే వడ్డీ కంటే ట్రస్ట్ అదనంగా వడ్డీ ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నిబంధనల మేరకు ప్రతి నెలా ట్రస్ట్ ఆన్‌లైన్ రిటర్న్‌ల గురించి ఈపీఎఫ్‌వోకు సమాచారం అందించాలి. అయితే, ఈ ఏడాది జనవరి నుంచి ఉద్యోగుల ఈపీఎఫ్‌ను యాజమాన్యం చెల్లించకపోవడంతో సమస్య ప్రారంభమైంది. యాజమాన్యం ప్రతి నెలా సుమారు రూ.70 కోట్లు ట్రస్ట్‌కు చెల్లించాల్సి ఉంది. జనవరి నుంచి ఈ ప్రక్రియ ఆగిపోవడంతో ట్రస్ట్ ప్రతినిధులు కూడా ఈపీఎఫ్‌వోకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. దీంతో ఈపీఎఫ్‌వో నుంచి ట్రస్ట్‌కు నోటీసులు వస్తున్నాయి. చివరగా ఈ నెల 24న ఈపీఎఫ్‌వో నుంచి ట్రస్ట్ ప్రతినిధులకు ఒక నోటీసు వచ్చింది. రెండు రోజుల్లోపు ట్రస్ట్ లావాదేవీలను సక్రమంగా నిర్వహించకపోతే చట్టపరంగా ప్రాసిక్యూషన్ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆ నోటీసులో హెచ్చరించారు. ఈ క్రమంలో యాజమాన్యం నుంచి జనవరికి సంబంధించి ఒక పార్ట్ పేమెంట్ జరిగినట్టు సమాచారం. ఇంకా సుమారు రూ.270 కోట్లను ట్రస్ట్‌కు చెల్లించాల్సి ఉంది.

డ్రెడ్జ్-8 నౌకలో అత్యవసర మరమ్మతులు పూర్తి


మరమ్మతులు పూర్తి చేసుకున్న డ్రెడ్జ్-8 నౌక

విశాఖ సిటీ: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) కేవలం అయిదు రోజుల్లోనే అత్యవసర డ్రై డాకింగ్ పనులను విజయవంతంగా పూర్తి చేసింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన డ్రెడ్జ్–8 నౌక అత్యవసర మరమ్మతుల కోసం ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హెచ్ఎస్ఎల్‌కు వచ్చింది. సంస్థ అధికారులు, సిబ్బంది 24 గంటల ప్రణాళికతో ఐదు రోజుల్లో పనులు పూర్తి చేశారు. దీనిపై హెచ్ఎస్ఎల్ సీఎండీ హేమంత్ ఖాత్రి అధికారులు, సిబ్బందిని అభినందించారు. సాంకేతికతతో రికార్డు సమయంలో సేవలు అందించామన్నారు.

'యూహెచ్3హెచ్' హెలికాప్టర్‌కు నావికాదళం ఘన వీడ్కోలు


యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ స్క్వాడ్రన్

ఎంవీపీకాలనీ: భారత నావికాదళంలో 17 ఏళ్ల పాటు అద్భుతమైన సేవలందించిన యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్‌కు తూర్పునావికాదళం ఘన వీడ్కోలు పలికింది. ఈ మేరకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో డి–ఇండక్షన్ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తూర్పు నావికాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సేనా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యూహెచ్3హెచ్ స్క్వాడ్రన్‌లోని అనుభవజ్ఞులైన అధికారులు, నావికులు పాల్గొన్నారు. 17 ఏళ్లుగా పాటు ఈ హెలికాప్టర్ అందించిన అద్భుత సేవలను వారు వివరించారు. యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ సేవలను ఐఎన్ఏఎస్ 350 వద్ద సీ కింగ్ 42సీ హెలికాప్టర్‌తో భర్తీ చేసినట్లు వెల్లడించారు. 2007లో ఐఎన్ఎస్ జలశ్వతో పాటు యూహెచ్3హెచ్ హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మార్చి 24, 2009 నుంచి విశాఖ ఐఎన్ఎస్ డేగా వద్ద ఐఎన్ఏఎస్ 350 సారస్‌గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. తన సేవలతో యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. విశాఖలోని సిటీ ఆఫ్ డెస్టినీలోని ప్రముఖ ప్రదేశంలో ఈ హెలికాప్టర్ శాశ్వతంగా ప్రదర్శనకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన స్మారక ఫలకాన్ని చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సేనా విమానాల బదిలీకి గుర్తుగా విశాఖ ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు అందజేశారు.


ఇన్‌చార్జ్ కలెక్టర్ అశోక్‌కు స్మారక ఫలకాన్ని అందజేస్తున్న సమీర్ సక్సేనా తదితరులు

'డీజీ యాత్ర' రెడీ

- మొబైల్‌లో సాఫ్ట్ కాపీతో నేరుగా ఎయిర్‌పోర్టులోకి..
- ఫేస్ రీడింగ్‌తో తగ్గనున్న చెకింగ్ పాయింట్లు
- విమాన ప్రయాణికులకు కలిసి రానున్న సమయం
- విశాఖ విమానాశ్రయంలో మొదలైన ట్రయల్ రన్
- త్వరలోనే పూర్తి స్థాయిలో అమలుకు సన్నాహాలు


ఎయిర్‌పోర్టులో డీజీ యాత్ర గేట్లు

సాక్షి, విశాఖపట్నం: విమాన ప్రయాణికులు ఇకపై మునుపటిలా ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు. విమానం ఎక్కడానికి గంటన్నర, రెండు గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవలసిన పని లేదు. వివిధ తనిఖీల కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టే 'డీజీ యాత్ర' సదుపాయం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో అందుబాటులోకి వస్తోంది. దీంతో ప్రయాణికులకు వివిధ రకాల చెక్‌ల నుంచి ఉపశమనం కలగనుంది. డిపాచర్ పాయింట్ వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది బోర్డింగ్ పాస్, గుర్తింపు కార్డును తనిఖీ చేస్తుంటారు. ఇకపై డీజీ యాత్రతో మొబైల్ ఫోన్‌లో సాఫ్ట్ కాపీని చూపించి నేరుగా ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించే వీలుంటుంది. ఈ డీజీ యాత్ర కాగిత రహిత ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. దేశంలోని 12 ఎయిర్‌పోర్టుల్లో డీజీ యాత్ర సదుపాయాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో మన విశాఖ విమానాశ్రయం కూడా ఉంది. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చించారు. ఈ 'డీజీ యాత్ర' వల్ల విమానాశ్రయంలో ప్రయాణికుల డిజిటల్ ప్రాసెసింగ్ ద్వారా చెక్ పాయింట్ల వద్ద ముఖ గుర్తింపు వ్యవస్థ ఆధారంగా ప్రాసెస్ చేయబడతారు. దీంతో ఎంట్రీ పాయింట్ చెక్, సెక్యూరిటీ చెక్‌లోకి ప్రవేశించడం, ఎయిర్‌క్రాఫ్ట్ బోర్డింగ్ వద్ద గేట్లు తెరుచుకుంటాయి. ఇంకా ప్రయాణికుల డేటా రికార్డ్‌ను గుర్తించడానికి ముఖ గుర్తింపు ద్వారా సెల్ఫ్ బ్యాగ్ డ్రాప్, చెక్ ఇన్‌ను కూడా సులభతరం చేస్తుంది. ఇలా బహుళ పాయింట్ల వద్ద గుర్తింపు తనిఖీని నివారిస్తుంది.


డీజీ యాత్ర పనితీరు ఇలా..

ప్రవేశ ద్వారం ఈ–గేటు వద్ద ప్రయాణికుడు తన బోర్డింగ్ పాస్ లేదా ఈ–టికెట్ (మొబైల్‌లో ప్రింట్ లేదా సాఫ్ట్ కాపీ) స్కాన్ చేస్తుంది. బార్ కోడ్/క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేశాక సిస్టం ప్రయాణికులు, విమాన వివరాలను ధ్రువీకరిస్తుంది. డీజీ యాత్ర ఐడీ ముఖ గుర్తింపు ద్వారా గుర్తింపును ధ్రువీకరిస్తుంది. టికెట్, డీజీ యాత్ర ఐడీ సక్సెస్ అయినట్టు నిర్ధారణ అయ్యాక ఈ–గేటు తెరవబడుతుంది. ఎయిర్‌పోర్టులో మిగిలిన ప్రయాణానికి టికెట్ పీఎన్ఆర్‌తో ముఖం ఒకే టోకెన్‌లో తయారు చేయబడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టంలో ఈ–గేట్ ద్వారా ప్రయాణికుడు సెక్యూరిటీ ఏరియా, ఎయిర్‌క్రాఫ్ట్ బోర్డింగులోకి ప్రవేశానికి వీలవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

ప్రయాణికులు ఇదివరకు మాదిరిగా బహుళ చెక్ పాయింట్ల వద్ద బోర్డింగ్ పాస్ లేదా ఐడీని చూపించాల్సిన అవసరం లేదు. కనీస మానవ జోక్యంతో క్యూలో నిల్చునే సమయం బాగా తగ్గుతుంది. ప్రయాణికులను పీఎన్ఆర్‌తో మ్యాప్ చేస్తుంది.. కాబట్టి భద్రత మెరుగు పడుతుంది. ప్రతి చెక్ పాయింట్ వద్ద సిసలైన ప్రయాణికులను మాత్రమే అనుమతిస్తుంది. ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌కు ప్రయాణికుల లోడ్‌పై నిర్దిష్ట సమయ సమాచారం ఉంటుంది. వీటన్నిటి ఫలితంగా విమాన ప్రయాణికుడు వేచి ఉండే సమయం, ప్రయాస చాలా వరకు తప్పుతుంది. అంటే ఎయిర్‌పోర్టులో పట్టే సమయం 30 నిమిషాల నుంచి 5–10 నిమిషాలకు తగ్గుతుంది.

ట్రయల్ రన్ ప్రారంభం..



విశాఖ విమానాశ్రయంలో 'డీజీ యాత్ర'పై రెండు రోజుల క్రితం నుంచి ట్రయల్ రన్ చేపట్టాం. రోజుకు 100–150 మంది వరకు డీజీ యాత్ర ద్వారా వెళ్తున్నారు. డీజీ యాత్ర వినియోగానికి వీలుగా నాలుగు గేట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే డీజీ యాత్రను అధికారికంగా ప్రారంభిస్తాం. ఈ ఎయిర్‌పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ముందుముందు వీరంతా డీజీ యాత్ర ద్వారానే పయనించే వీలుంటుంది.

– **ఎస్. రాజారెడ్డి,** డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు

నారాయణ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ దాష్టీకం

- క్రమశిక్షణ పేరుతో విద్యార్థిని తీవ్రంగా కొట్టిన వైనం
- విశాఖ మధురవాడ దుర్గానగర్ కళాశాలలో ఘటన




విచారణ చేస్తున్న పీఎంపాలెం పోలీసులు (ఇన్‌సెట్) గాయపడిన విద్యార్థి

మధురవాడ (విశాఖ): నారాయణ విద్యాసంస్థల్లో ఆగడాలు ఆగడం లేదు. లక్షల్లో ఫీజు కట్టిన విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో వేధిస్తూ తీవ్రంగా కొడుతున్నారు. మధురవాడ దుర్గానగర్‌లో ఉన్న నారాయణ ఐఐటీ అండ్ మెయిన్స్ అకాడమీ డే క్యాంపస్‌లో సహచర విద్యార్థినితో మాట్లాడాడని విద్యార్థిని ప్రిన్సిపాల్ చెంపమీద కొట్టడమే కాకుండా అతడిని మూడో ఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ గ్రౌండ్‌ఫ్లోర్ వరకు లాక్కొచ్చారు. బాధిత విద్యార్థి, అతడి తల్లిదండ్రులు తెలిపిన మేరకు.. పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన షేక్ హిమామ్ పదిరోజుల కిందట ఇక్కడ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో చేరాడు. హిమామ్ కళాశాలలో ఆలస్యంగా జాయిన్ కావడంతో గురువారం అదే సెక్షన్‌లో ఉన్న ఓ విద్యార్థినితో నోట్స్ విషయమై మాట్లాడాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ రాజేష్ కనీస విచారణ చేయకుండానే చెంపపై గట్టిగా కొట్టారు. భయం, నొప్పితో విద్యార్థి అరవడంతో బోర్డుకు తల గుద్దించి, మూడోఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ కిందికి లాక్కొచ్చారు. సహచర విద్యార్థుల సమక్షంలో ఇష్టానుసారం కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న హిమామ్ తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని నిలదీశారు. తల్లిదండ్రుల నిరసనతో ఈ దాష్టీకం బయటకు పొక్కింది. పీఎంపాలెం పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. దీనిపై ప్రిన్సిపాల్ రాజేష్‌ను అడగగా.. విద్యార్థులు అమ్మాయిలతో మాట్లాడకూడదని ముందే చెప్పినా పట్టించుకోలేదని, హిమామ్‌ను సన్మార్గంలో పెట్టడం కోసం చెంపపై కొట్టానని, క్రమశిక్షణ చర్యలే తప్ప మరేం కాదని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఏయూ పీజీ సెట్‌లో నిహారిక ప్రతిభ



చోడవరం రూరల్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులలో చేరడానికి నిర్వహించిన ఏయూ పీజీ సెట్‌లో మండలానికి చెందిన విద్యార్థిని కనిశెట్టి నిహారిక విశేష ప్రతిభ కనబరిచింది. తాజాగా వెల్లడైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఎమ్మెస్సీ కంప్యూటర్స్ విభాగంలో 13వ ర్యాంకు సాధించింది. మండలంలోని గజపతినగరానికి చెందిన కనిశెట్టి రామారావు(పెదబాబు), కృష్ణవేణిల చిన్నమ్మాయి నిహారిక గాజువాకలోని ఓ కళాశాలలో కంప్యూటర్స్ స్టాటస్టిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, పీజీ సెట్‌కు హాజరయింది. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించిన నిహారికను గ్రామస్తులు, సహ విద్యార్థులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రోలుగుంట: ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన 23 రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరెల్ల చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలోని జె.నాయుడుపాలెంలో శుక్రవారం కేవీపీఎస్ మండల సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు భూమి అభివృద్ధి పథకం, 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, ఎస్సీ,బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మజూరు చేయాలని కోరారు. ఎస్సీ,ఎస్టీలకు చెందిన సంక్షేమ పథకాలు 13 రకాలు అమలు చేయాలని,లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి



శంకరరావు(ఫైల్)

గోపాలపట్నం (విశాఖ): గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రి వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో.. కరెంట్ షాక్‌కు గురై హెల్పర్ సిరపురపు శంకరరావు(51) మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. సింహాచలం సాయినగర్‌కు చెందిన సిరపురపు శంకరరావు లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద విద్యుత్ సమస్య ఉండడంతో.. స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా దెబ్బలు తగిలాయి. వెంటనే అతన్ని బెహరా ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారముజామున ఆయన మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నా క్యాంటీన్‌కు మున్సిపల్ నిధులా?

టీడీపీ కౌన్సిలర్లను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ రామకృష్ణ

నర్సీపట్నం: గత ప్రభుత్వంలో ఇతర అభివృద్ధి పనులకు మున్సిపల్ నిధులు ఖర్చు చేస్తే అభ్యంతరం చెప్పిన మీరు ఇప్పుడు అన్నా క్యాంటీన్‌కు ఎలా మళ్లిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్లను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. అన్నా క్యాంటిన్ ఆధునికీకరణకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం జీవో ఇస్తే కౌన్సిల్ ముందుంచాలని అధికారులకు సూచించారు. దీనికి అధికారులు నీళ్ల నమిలారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మున్సిపల్‌లో కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల మరణించిన చైర్‌పర్సన్ కుమారుడు షేర్‌కు కౌన్సిలర్లు నివాళులర్పించారు. అనంతరం ఎజెండాలోని అంశాలను కౌన్సిల్ ముందుంచారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడుకు వెస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో తాము అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం మిగిలిన పనులను పూర్తి చేయడంతోపాటు మరిన్నీ అభివృద్ధి పనులు చేపడతారని ఆశిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ ప్రజలు నమ్మి అధికారం ఇచ్చారని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే 2029లో తగిన బుద్ధి చెబుతారన్నారు. మున్సిపల్ అధికారులు బాధ్యతగా పని చేసి ఉంటే తాము ఓటమి చెందేవాళ్లం కాదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శానిటేషన్, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. చెత్త నిర్వహణ ట్రాక్టర్ల టెండర్ కాలం ముగిసిన తర్వాత ఎందుకు పొడిగించాల్సిన అవసరమొచ్చిందని టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు అధికారులను నిలదీశారు. వెంటనే రద్దు చేసి టెండర్ పిలవాలని, లేని పక్షంలో శాసనసభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వీధిలైట్లు, శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందని టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్, జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఆగ్రహించారు. సచివాలయాల్లో సిస్టమ్స్ పని చేయకపోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీకాంత్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. సిస్టమ్స్ సక్రమంగా పని చేసే విధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలని కమిషనర్ రవిబాబుకు చైర్‌పర్సన్ సూచించారు. శానిటేషన్, వీధిలైట్ల నిర్వహణ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటానని, సచివాలయ సేవలకు అంతరాయం కలగకుండా దృష్టి సారిస్తానని తెలిపారు.

రైఫిల్ షూటింగ్‌లో చోడవరం విద్యార్థికి గోల్డ్ మెడల్



షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి రామారెడ్డి

చోడవరం రూరల్: రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో చోడవరం పట్టణానికి చెందిన 14ఏళ్ల విద్యార్థి నల్లమిల్లి సుందర రామారెడ్డి వ్యక్తిగత విభాగంలో ప్రథమ శ్రేణిలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 21నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో ఇండివిడ్యువల్ విభాగంలో 400 పాయింట్లకు గాను 371 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన రామారెడ్డి నేషనల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. చోడవరంలో ఉంటున్న నల్లమిల్లి గనిరెడ్డి, శ్రీలక్ష్మి దంపతుల రెండవ సంతానమైన రామారెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ

మునగపాక: వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.ఎ స్.వి.కె.బాలాజీ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఒంపోలులో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. రానున్న సీజన్‌లో ప్రజలు అంటు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డయేరియా, జ్వరాలు, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. గ్రామాల్లో వాడుక నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి విమలగిరి, సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎం నాగజ్యోతి తదితరులున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి

సీతమ్మధార(విశాఖ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర ప్రజలకు ఇచ్చిన ప్రధాన ఎన్నికల హామీలను అమలు చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 1,262వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ఆమె సంఘీభావం తెలిపి మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. తెలుగు ప్రజల ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ 8 వేల మందికి పైగా నిర్వాసితులు సర్వం పోగొట్టుకొని, ఉపాధి లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కె.బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, కోశాధికారి ఎల్. వరలక్ష్మి, సభ్యులు నాగమణి, జయ, కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

విశాఖ పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రతా బాగ్చి

- ప్రస్తుత సీపీ రవిశంకర్ సీఐడీకి బదిలీ



శంఖబ్రతా బాగ్చి

విశాఖ సిటీ: విశాఖపోలీస్ కమిషనర్‌గా అడిషినల్ డైరెక్టర్ జనరల్ (లాఅండ్‌ఆర్డర్) శంఖబ్రతా బాగ్చి నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ సీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.రవిశంకర్ సీఐడీ ఏడీజీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బాగ్చి 1996 ఐపీఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యారు. దేశరాజధాని, కోల్‌కతా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. 1997లో ప్రొబేషనర్‌గా చేరిన బాగ్చి జమ్మలమడుగు ఏఎస్పీ, కడప, ఓఎస్డీ, కోల్‌కత్తాలో సెంట్రల్ డిటెక్టివ్ ట్రెనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అలాగే నిజామాబాద్ ఎస్పీగాను, ఏపీఎస్పీ 1వ బెటాలియన్ హైదరాబాద్‌లోను, కర్నూల్‌ఎస్పీ, గుంటూరుఎస్పీ, గ్రేహౌండ్స్, డీఐజీగా విధులు నిర్వర్తించారు. అదే విధంగా సీఐడీ డీఐజీగానే కాకుండా న్యూఢిల్లీలో సీబీఐ డీఐజీగాను వ్యవహరించారు.ఏసీబీ డైరెక్టర్‌గాను, ఏపీఎస్పీ బెటాలియన్ ఏడీజీగా, ఇంటెలిజెన్స్ ఏడీజీగా,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా, డీజీ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(పర్సనల్-అడ్మిన్)గా, లా అండ్ ఆర్డర్ ఏడీజీగా, ఏపీ స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్‌గానే కాకుండా రాష్ట్రఇంచార్జ్‌డీజీపీగా కూడా వ్యవహరించారు. తాజాగాఆయనను రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా నియమించింది. విశాఖ కమిషనరేట్‌ను ఏడీజీ స్థాయికి గత వైఎస్సార్ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఏడీజీగా ఉన్న రవిశంకర్‌ను విశాఖసీపీగా నియమించింది. కొత్తప్రభుత్వంకూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ బాటలోనే ఏడీజీ స్థాయి అధికారిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించింది.

రవిశంకర్ అద్భుత సేవలు : విశాఖ సీపీగా ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన డాక్టర్ రవిశంకర్ అయ్యనార్‌ను సీఐడీ ఏడీజీగా బదిలీ చేశారు. 2023, సెప్టెంబర్ 15న నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవిశంకర్ కీలక నిర్ణయాలతో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రధానంగా స్పందన, డయల్ యువర్ సీపీతో పాటు రాష్ట్రంలోనే తొలిసారిగా దివ్యాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు సత్ఫలితాన్నిచ్చాయి.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

135 మంది విద్యార్థులు హాజరు



ప్రవేశ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తదితర్లు

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ సీహెచ్. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ పి.రఘు, కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, బి. నాగరాజు ఆధ్వర్యంలో ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. 193 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 135 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 6వ తరగతికి 69 మంది, 7వ తరగతికి 26 మంది, 8వ తరగతికి 25 మంది, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 15 మంది హాజరయ్యారన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పలు రైళ్లకు తాత్కాలిక పద్ధతిలో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్‌కు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు జూలై 2 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఓ థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నారు.
- విశాఖపట్నం-నాందేడ్(20811) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 31వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్-విశాఖపట్నం(20812) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 3 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు(రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు.
- విశాఖపట్నం-అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 6 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు(12845) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్ (12846) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 8 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4 నుంచి 25వ తేదీ వరకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు, తిరుపతి-భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూలై 8 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నారు.
- భువనేశ్వర్-పుణె(22882)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, పుణె-భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-పుదుచ్చేరి(12898) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 3 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్‌క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-రామేశ్వరం(20896) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు, రామేశ్వరం-భువనేశ్వర్ (20895) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు ఒక స్లీపర్‌క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు.
- పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 6 నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి శుక్రవారం బయలుదేరిన పలు రైళ్లను రీ-షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) వీక్లీ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు, ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఐదున్నర గంటలు ఆల్యంగా సాయంత్రం 3.30 గంటలకు బయలుదేరాయి.

క్లుప్తంగా

అట్రాసిటీ బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలి



అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌తో రేబాక మధు, అప్పలరాజు

అనకాపల్లి: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధు, ఎం.అప్పలరాజులు కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ అనకాపల్లి, మునగపాక స్టేషన్లలో పరిహారం అందని బాధితుల ఎఫ్ఐఆర్ వివరాలను వినతిపత్రంలో పొందుపరిచారు. ఈ బాధితులు పరిహారం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

అనకాపల్లి: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆదివారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో చెల్లించవచ్చని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు తమ బిల్లులను నేరుగా శాఖా కార్యాలయంలో చెల్లించవచ్చని, లేనిపక్షంలో ఫోన్ పే, గూగుల్ పే, ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగమణి

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 141 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,100	4,380
మూడోరకం	3,100	3,770

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
కల్కి2898 ఏడీ	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 30 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 316 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- ఆకు నుంచి బెరడు వరకూ ఔషధ గుణాలు
- నేరేడు పండ్లకు మార్కెట్లో డిమాండ్
- సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి

నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. తినడానికి కాస్త వగరు, పులుపు, తీపి కలబోతగా ఉండే వీటిలో పోషకాలు మాత్రం చాలా మెండు. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు బీపీ, సుగర్, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, సీజనల్ రోగాల నియంత్రణకు ఎంతగానో దోహదపడతాయి. గ్రామాల్లో నేరేడు పండ్లను సర్వరోగ నివారిణిగా భావిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో నల్లగా నిగనిగలాడుతూ, చూడగానే నోరూరించేలా కనిపిస్తున్నాయి.



నిగనిగలాడుతున్న నేరేడు పండ్లు



నేరేడు పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి

నేరేడు ఉపయోగాలు

- శరీర భాగాల్లో గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పనిచేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఇదొక దివ్యౌషధం.
- పొట్టలో ఉండే నులిపురుగులను నేరేడు నివారిస్తుంది.
- నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయని పెద్దలు చెబుతారు.
- మధుమేహ వ్యాధి పీడితులకు నేరేడు పండు ఒక వరం. గింజలను పొడిగా చేసుకుని రోజూ నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంత క్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని ప్రతి రోజూ పుక్కిలిస్తే ఉపశమనం కలుగుతుంది.
- నోటి పూత వచ్చినప్పుడు రెండు, మూడు నేరేడు పండ్లను తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి లభిస్తుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషధంలా పనిచేస్తాయి.

తుమ్మపాల: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా నేరేడు పండ్లు పుష్కలంగా కనిపిస్తున్నాయి. సీజన్‌లో మాత్రమే దొరికే పండ్లలో నేరేడు పండ్లకు చాలా ప్రాధాన్యత ఉంది. సీజనల్ వ్యాధులకు గురవకుండా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి బాగా పనిచేస్తాయి. వీటిలో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయి. గ్రామీణ మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఈ సీజన్లో నేరేడు పండ్లు విరివిగా దొరుకుతాయి.

హైబ్రిడ్ రకానికి గిరాకీ

వర్షాకాలం ఆరంభం నుంచి నేరేడు పండ్ల సీజన్ మొదలవుతుంది. ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, మండల గ్రామాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాటు పండ్ల కంటే హైబ్రిడ్(జంబో నేరేడు) రకానికి గిరాకీతోపాటు ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.170 వరకు ఉంటే హైబ్రిడ్ కిలో రూ.200 నుంచి రూ.250 మధ్య విక్రయిస్తున్నారు. మధుమేహం, రక్తహీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యే వారు ఈ సీజనల్ పండ్లను తింటే చాలా వరకు రోగాలను నియంత్రించుకోవచ్చని నిపుణులు చెప్పున్నారు.

వీరు తినకపోవడమే మంచిది

నేరేడు పండ్లు ఎక్కువగా తింటే బీపీ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుంది. శస్త్రచికిత్స చేయించుకునే వారు వీటికి దూరంగా ఉండటమే మేలు. లోబీపీ సమస్య ఉన్నవారూ వీటిని ఎక్కువగా తినరాదు. ఖాళీ కడుపుతో నేరేడు పండ్లను అస్సలు తినరాదు. ఈ పండ్లను అధికంగా తింటే మొటిమలు వస్తాయి. చర్మ సమస్యలున్నవారు తింటే అలర్జీలు పెరుగుతాయి. గర్భిణులు తినకూడదన్నది అపోహ మాత్రమే. పుట్టే పిల్లలు నల్లగా పుడతారన్న ప్రచారంలో వాస్తవం లేదని వైద్యులు చెప్తున్నారు.

నేరేడుతో ఆరోగ్యానికి మేలు



నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నేరేడు పండ్లకు శరీరంలోని విష గుణాల్ని హరించే శక్తి ఉంది. శస్త్ర చికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకుల్ని ఎక్కువగా వినియోగించేవారట. మధుమేహం, రక్తహీనత, బీపీతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఇవి ఔషధంలా పని చేస్తాయి. సీజన్‌లో దొరికే నేరేడు పండ్లను కాస్త శుభ్రపరచుకుని తినొచ్చు. – డాక్టర్ పావని, పీహెచ్‌సీ వైద్యురాలు, తుమ్మపాల

ఫీ‘జులుం’ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



శ్రీలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

అనకాపల్లి: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) నోడల్ అధికారి శ్రీలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ద్వారా చేరిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఉచిత విద్య అని ప్రవేశాలు కల్పించి, ఇప్పుడు ఫీజుల కోసం ఒత్తిడి తెస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట భారీగా దోచుకుంటున్నారని, వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం శోచనీయమన్నారు. తరగతుల వారీగా ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీపై అవగాహన సదస్సు రేపు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం ఆదివారం సాయంత్రం 4 గంటలకు టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ 81వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కలు ‘భౌ’బోయ్!



కశింకోట వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో ఊర కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి, మేదరవీధి, గవరపేట మధ్య వీధి, కస్పా వీధి, వడ్డి వీధి, గోవిందరావు కాలనీ, భవాని కాలనీ, హౌసింగ్ కాలనీ, ఉప్పునీటి దిబ్బ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులపై, నడిచి వెళ్లేవారిపై అరుస్తూ, మూకుమ్మడిగా వెంట పడుతున్నాయి. ఒక్కోసారి వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. ఇక చీకటి పడిందంటే వీటి బాధ చెప్పనలవి కాకుండా ఉంది. దీంతో ఇతర పనుల మీద, ఉద్యోగరీత్యా విధులకు వెళ్లి, ఇళ్లకు వచ్చే వారు కుక్కల బారిన పడక తప్పడం లేదు. దీంతో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: స్థానిక సంతబయలులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమం, తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు

యలమంచిలి రూరల్: మాజీ ప్రధాని, బహుభాషాకోవిదుడు దివంగత పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా అన్నారు. పీవీ 104వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాయత్రీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతరాలు, అసమానతలు లేని సమాజం కోసం సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మార్గదర్శకుడు పీవీ అని కొనియాడారు. దివాలా దశలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరణలతో కోలుకునేలా చేసి, ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దిన ఘనత పీవీదే అన్నారు. భారత ప్రధానుల్లో ఏకైక తెలుగు బిడ్డగా పీవీ ఎనలేని ఖ్యాతినార్జించారని కొనియాడారు. కార్యక్రమంలో బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొటారు నరేష్, ట్రస్టు ప్రతినిధులు పెద్దింటి సూర్యనారాయణ మూర్తి, రాచకొండ పట్టాభిరామయ్య, లవుడు లోవ రాజు, గుర్రాల శేఖర్, సుందరపు బాబ్జీ, పల్లా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస శర్మ, వెంకటేష్, భాగవతుల సాయి, రాజు, బాబి పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

ఎస్.రాయవరం: గుడివాడ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న పదవీ విమరణచేయనున్న సైన్స్ టీచర్ కె.సుబ్బలక్ష్మి పాఠశాలలకు సామగ్రి అందజేశారు. విద్యార్థులకు 120 జామెట్రీ బాక్సులు, రెండు మంచినీటి క్యాన్లు,మూడు బల్లలు అందజేశారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సత్కారాలు తీసుకుని వెళతారు తప్ప సుబ్బలక్ష్మిలా తిరిగి పాఠశాలలకు సహకారం అందించే వారు అరుదుగా ఉంటారని ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర ఈ సందర్భంగా తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



రక్షణ గోడ లేని మినీవంతెన

కోటవురట్ల: పందూరులో గెడ్డపై గల మినీ వంతెకు రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు, పిల్లలు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లిన కిందపడక తప్పదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే ప్రదేశం కావడంతో మినీ వంతెనకు రెండు వైపుల రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి గ్రామంలో ధార్మిక సమితి



మాట్లాడుతున్న ధర్మ ప్రచారకులు

ఎస్.రాయవరం: ప్రతి గ్రామంలోనూ ధార్మిక సమితులను ఏర్పాటు చేసి, హిందూ సంప్రదాయాలను ఆచరించేలా చూడాలని సమరసత సేవా ఫౌండేషన్ విభాగ సంయోజక్ గురిమెళ్ల రాధాకృష్ణ అన్నారు. స్థానిక నూకాంబిక ఆలయంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ధార్మిక సమితులు నెలకొల్పాలని జిల్లా, మండల కన్వీనర్లకు సూచించారు. హిందూ దేవాలయాల ఆవశ్యకతపై ప్రత్యేక అవగాహన పెంచుకుని, హిందువులకు హితబోధ చేయాలన్నారు. పేద, నిమ్న వర్గాల్లో మత మార్పిడులను తగ్గించే క్రమంలో హిందూ సంప్రదాయాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పోతు రంగారావు, ఆడారి గంగాధర్, శిరియాల సత్యనారాయణ, మండల కన్వీనర్ ముత్తా గోవిందరావు, మహిళా కన్వీనర్ పెదపాటి లక్ష్మి, పలు మండలాల సహసంయోజన సభ్యులు అర్చకులు, ధర్మప్రచారకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



బయ్యవరంలో డయేరియాపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు



మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట: డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు సూచించారు. మండలంలోని బయ్యవరంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా డయేరియా నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. డయేరియా నివారణకు తీసుకోవలసిన చర్యలను ప్రజలకు వివరించారు. కాచి వడబోసిన నీటిని త్రాగాలన్నారు. క్లోరినేషన్ చేసిన తాగునీటిని వాడాలన్నారు. ఎవరైనా డయేరియా లక్షణాలతో బాధపడుతుంటే తక్షణమే సమీపంలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే చాలా రోగాలను నియంత్రించవచ్చన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవాల్లో..

మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల మలేరియా ప్రబలుతుందని, దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఇళ్లల్లో ఉన్న వాడుక నీటి పాత్రల్ని వారానికోసారి ఖాళీ చేసి, ఆరబెట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పరమానందరావు, విజయలక్ష్మి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘నిత్యావసరాల ధరలు తగ్గించాలి’



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యులు

అనకాపల్లి: ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరకుల ధరలతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పట్టణ ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. గడచిన 20 రోజులుగా కూరగాయల ధరలు సామాన్య ప్రజలకు అందనంత ఎక్కువగా పెరిగాయని, బియ్యం కిలోకి రూ.5 పెంచారని, పప్పుదినుసుల ధరలు కూడా భారీగా పెరిగినట్లు వాపోయారు. ధరల నియంత్రణకు జిల్లా అధికార యంత్రాంగం సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, బర్నికాన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘నేను బడికి పోతా’లో 83 మందికి ప్రవేశాలు



నేను బడికి పోతా ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో-2 కోటేశ్వరరావు

అనకాపల్లి: ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న ‘నేను బడికి పోతా’కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు పట్టణం, మండల పరిధిలో బడిబయట ఉన్న 83 మంది బడి ఈడు పిల్లల్ని గుర్తించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. జీవీఎంసీ భీమునిగుమ్మం హైస్కూల్ వద్ద శుక్రవారం జరిగిన నేను బడికి పోతా కార్యక్రమ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని గుర్తించి దగ్గర్లోని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు గిరిధర్, వై.రాణి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ

- ఇప్పటికే 60 శాతం పంపిణీ పూర్తి
- మండలానికి అదనంగా 50 క్వింటాళ్ల ఆర్జీఎల్ విత్తనాలు



వెదురుపర్తి ఆర్బీకేలో వరి విత్తనాల పంపిణీ



ఏనుగుతునిలో వరి విత్తనాల అందజేత

కశింకోట: మండలంలోని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా రైతులకు ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే 60 శాతం మేర విత్తనాల పంపిణీ పూర్తయింది. మిగిలిన విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల వారీగా 19 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే రైతులకు వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్నారు.

మండలానికి ఈ ఏడాది తొలి విడతగా 620 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేసే ఆర్జీఎల్ రకంతో పాటు సోనా మసూరి, సాంబ మసూరి, ఇతర రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసిన మేరకు రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వరి సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. దీంతో విత్తనాలను రైతులు తీసుకెళ్లి వారి ఇళ్ల వద్ద భద్రపరచుకుంటున్నారు. కొందరు ఇప్పటికే నారుమళ్లు వేసే పనిలో ఉన్నారు. మిగిలిన వారు కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలానికి సరఫరా చేసిన విత్తనాలు సరిపోవని, అదనంగా విత్తనాలు రప్పించి, కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్నను సంప్రదించగా, మండలానికి వరి విత్తనాల అవసరంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరో 50 క్వింటాళ్ల ఆర్‌జీఎల్ రకం విత్తనాల సరఫరాకు తాజాగా ఆమోదం లభించిందన్నారు. అవి శనివారానికి ఇక్కడకు చేరగలవన్నారు. దీంతో విత్తనాల కొరత ఉండదని పేర్కొన్నారు. చిన్న గ్రామాల్లో విత్తనాల పంపిణీ దాదాపు పూర్తి అయిందని, మిగిలిన గ్రామాల్లో పంపిణీ జరుగుతోందన్నారు.

ఉపాధిహామీ కూలీల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి: ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు కోరారు. సీఐటీయూ నాయకులతో కలసి శుక్రవారం ఆయన యలమంచిలి మండలం రేగుపాలెం, పోతిరెడ్డిపాలెంల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను ఆరా తీశారు. ఐదు వారాల నుంచి బకాయిలు చెల్లించలేదని, 100 రోజుల పని కల్పించలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే మంజూరు చేసి, 200 రోజుల పనిదినాలు, రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.